
# రూపాయి.. మహాప్రభో

## ఒక్కరోజే 66 పైసలు క్షీణత.. గత రెండేండ్లలో తొలిసారి

**ఆల్‌టైమ్ కనిష్ఠానికి దేశీయ కరెన్సీ • డాలర్‌తో పోల్చితే 86.70కు మారకపు విలువ**



ముంబై, జనవరి 13: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ దారుణంగా క్షీణించింది. సోమవారం ఒక్కరోజే ఏకంగా 66 పైసలు దిగజారింది. దాదాపు గత రెండేండ్లలో ఈ స్థాయిలో ఎప్పుడూ పడిపోకపోవడం గమనార్హం. 2023 ఫిబ్రవరి 6న 68 పైసలు పతనమైంది. మళ్లీ ఇప్పుడే అంతటి నష్టం వాటిల్లింది. ఈ క్రమంలోనే మునుపెన్నడూ లేనివిధంగా ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ వద్ద రూపీ వాల్యూ 86.70 స్థాయికి చేరి ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకింది. నిజానికి గతకొద్ది రోజులుగా డాలర్ ఎదుట ఏమాత్రం నిలదొక్కుకోలేకపోతున్న భారతీయ కరెన్సీ.. రోజుకింత క్షీణిస్తూ ఆల్‌టైమ్ కనిష్ఠాల్లోనే కదలాడుతున్నది. కాగా, అమెరికా మార్కెట్‌లో అంచనాల్ని మించి ఉద్యోగ వృద్ధి నమోదవడం.. డాలర్‌కు ఒక్కసారిగా డిమాండ్‌ను తెచ్చిపెట్టిందని ఫారెక్స్ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇదిలావుంటే రూపాయి విలువ పతనం.. ఎగుమతిదారులకు పరిమిత శ్రేణిలోనే ప్రయోజనాలను తెచ్చిపెడుతుందని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. దేశీయ ఎగుమతుల కంటే దిగుమతులే ఎక్కువగా ఉండటం, అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చిత వాతావరణం నెలకొనడం ఇందుకు కారణాలుగా వారు పేర్కొంటున్నారు. మరోవైపు రూపాయి నష్టం.. దేశ ఆర్థిక వ్యవస్థకూ దెబ్బేనని, ద్రవ్యోల్బణం విజృంభణకు దారితీయవచ్చని కూడా వారు హెచ్చరిస్తున్నారు. రూపీ నష్టాలకు బ్రేక్ పడకపోతే సంక్షోభం ముప్పు ఖాయమన్న ఆందోళనల్నీ వెలిబుచ్చుతున్నారు. మరోవైపు రూపాయి పతనం రాజకీయంగానూ ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. అధికార బీజేపీ ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అత్యంత స్థిరంగా ఉన్న కరెన్సీల్లో రూపాయి ఒకటని అంటుండగా, కాంగ్రెస్ మాత్రం మసిబూసి మారేడుకాయ చేస్తున్నారని ధ్వజమెత్తుతున్నది.

### పరిశ్రమకు ప్రోత్సాహకాల్లో
# ప్రభుత్వ నిర్లక్ష్యం

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నది. రూ.4,236 కోట్లకుగాను కేవలం రూ.1,000 కోట్లనే ఇచ్చింది. ఇన్నాళ్లూ నూతన ఎంఎస్‌ఎంఈ విధానం, కొత్త పారిశ్రామిక విధానం పేరుతో తాత్సారం చేసిన రేవంత్ సర్కార్.. తాజాగా రూ.1,000 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పరిశ్రమ వర్గాలు పెదవి విరుస్తున్నాయి.

# హైదరాబాద్‌కు గిరాకీ నై

న్యూఢిల్లీ, జనవరి 13: వచ్చే ఏడాది మార్చిదాకా హైదరాబాద్‌లో 25 శాతం ఆఫీస్ స్పేస్ ఖాళీగానే ఉండొచ్చని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఐసీఆర్‌ఏ అంచనా వేస్తున్నది. డిమాండ్‌కు మించి మార్కెట్‌లోకి కొత్తగా ఆఫీస్ స్పేస్ వస్తున్నదని ఐసీఆర్‌ఏ ప్రతినిధి అనుపమ రెడ్డి చెప్తున్నారు. ఇదిలావుంటే గోద్రేజ్ ప్రాపర్టీస్ హైదరాబాద్‌లో తమ తొలి హౌజింగ్ ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. కోకాపేట్‌లో 3 ఎకరాల్లో ప్రీమియం రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను తెస్తున్నది.

# స్టార్ల టైటిల్ వేట షురూ

**అల్కరాజ్, సిన్నర్, జకోవిచ్ శుభారంభం • స్వియాటెక్, గాఫ్ ముందంజ • సిట్సిపస్‌కు షాక్**


సిన్నర్


జకోవిచ్


స్వియాటెక్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ తొలి రౌండ్ పోటీలలో స్టార్ టెన్నిస్ ప్లేయర్లు శుభారంభం చేశారు. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన యానిక్ సిన్నర్ (ఇటలీ), 25వ టైటిల్ వేటలో ఉన్న నొవాక్ జకోవిచ్ (సెర్బియా), స్పెయిన్ కుర్రాడు కార్లోస్ అల్కరాజ్ రెండో రౌండ్‌కు చేరారు. మెల్‌బోర్న్‌లోని రాడ్ లీవర్ ఎరీనాలో జరిగిన పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో మొదటి సీడ్ సిన్నర్.. 7–6 (7/2), 7–6 (7/5), 6–1తో నికోలస్ (చిలీ)పై వరుస సెట్లలో గెలుపొందాడు. తొలి రెండు సెట్లలో టైబ్రేక్‌తో గట్టెక్కిన అతడు.. మూడో సెట్‌లో మాత్రం ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండానే మ్యాచ్‌ను ముగించాడు. మ్యాచ్‌లో అతడు 7 ఏస్‌లు, 24 విన్నర్లు కొట్టాడు. ఏడో సీడ్ జకోవిచ్.. 4–6, 6–3, 6–4, 6–2తో తెలుగు మూలాలున్న అమెరికా ఆటగాడు ఎన్. బసవరెడ్డిని ఓడించాడు. కొత్త కోచ్ ఆండీ ముర్రే మార్గదర్శకత్వంలో బరిలోకి దిగిన జకో.. తొలి సెట్‌ను కోల్పోయినప్పటికీ ఆ తర్వాత పుంజుకున్నాడు. మ్యాచ్‌లో 23 ఏస్‌లు సంధించిన జకో.. 51 విన్నర్లు బాదాడు. మరో మ్యాచ్‌లో అల్కరాజ్.. 6–1, 7–5, 6–1తో శెవ్‌చెన్‌కో (కజకిస్థాన్)ను మట్టికరిపించి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించాడు. గ్రీకు వీరుడు, 11వ సీడ్ స్టెఫనోస్ సిట్సిపస్‌కు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. అమెరికా కుర్రాడు మిచెల్‌సన్.. 7–5, 6–3, 2–6, 6–4తో సిట్సిపస్‌కు షాకిచ్చాడు.


**మహిళల విభాగాల్లో..**

మహిళల సింగిల్స్‌లో పోలండ్ బామ స్వియాటెక్ 6–3, 6–4తో క్యాథరీనా సినికొవ (చెక్)ను వరుస సెట్లలో చిత్తుచేసింది. స్వియాటెక్ బలమైన సర్వీసుల ముందు క్యాథరీనా నిలువలేకపోయింది. అమెరికా అమ్మాయి గాఫ్.. 6–3, 6–3తో తన దేశానికే చెందిన సోఫియా కెనిన్‌పై అలవోక విజయం సాధించింది. జెస్సిక పెగుల.. 6–3, 6–0తో మయ జాయింట్ (ఆస్ట్రేలియా)పై గెలుపొందింది. మాజీ యూఎస్ చాంపియన్ నవోమి ఒసాకా.. 6–3, 3–6, 6–3తో కరోలినా గ్రేసియా (ఫ్రాన్స్)ను చిత్తు చేయగా విక్టోరియా అజరెంక, జెలినా ఒట్సపెంకొ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు.

# స్టాక్ మార్కెట్లు

## సెన్సెక్స్ 1,049, నిఫ్టీ 346 పాయింట్లు డౌన్

**రూ.24.69 లక్షల కోట్లు ఆవిరి**



ముంబై, జనవరి 13: భారతీయ స్టాక్ మార్కెట్లలో వరుస నష్టాలు.. మదుపరులకు స్ట్రోక్ తెప్పిస్తున్నాయి. సోమవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ మరో 1,000 పాయింట్లకుపైగా పడిపోయింది. దేశ, విదేశీ ప్రతికూల పరిస్థితులు.. ఈక్విటీ మార్కెట్లను గట్టిగానే కుదిపేస్తున్నాయి మరి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 1,048.90 పాయింట్లు లేదా 1.36 శాతం దిగజారి 77వేల మార్కుకు దిగువన 76,330.01 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 1,129.19 పాయింట్లు కోల్పోవడం గమనార్హం. 508 స్టాక్స్ 52 వారాల కనిష్ఠాన్ని తాకడం గమనించదగ్గ అంశం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ కూడా 345.55 పాయింట్లు లేదా 1.47 శాతం క్షీణించి 23,085.95 వద్ద ముగిసింది. దీంతో వరుసగా నాల్గోరోజూ సూచీలు నష్టాలకే పరిమితమైనట్టైంది.

*వరుస నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లు.. మదుపరుల సంపదను లక్షల కోట్ల రూపాయల్లో కరిగించేస్తున్నాయి. గత నాలుగు రోజుల్లో బీఎస్‌ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.24,69,243.3 కోట్లు హరించుకుపోయింది. సోమవారం మార్కెట్ సమయం ముగిసేనాటికి రూ.4,17,05,906.74 కోట్లు (4.82 ట్రిలియన్ డాలర్లు)గానే ఉన్నది.*

**నష్టాలకు ప్రధాన కారణాలు**

- పెరిగిన ముడి చమురు ధరలు
- తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు
- రూపాయి మారకం విలువ పతనం
- ఫెడ్ వడ్డీరేట్ల కోతలు అంతంతేనన్న అంచనాలు
- నిరాశపరుస్తున్న కంపెనీల ఆర్థిక ఫలితాలు

# బ్యాంకింగ్ బేజార్

దేశీయ స్టాక్ మార్కెట్లలో బ్యాంకింగ్ రంగ షేర్ల పరిస్థితి మరీ దయనీయంగా తయారైంది. బీఎస్‌ఈ సెన్సెక్స్‌లో అత్యంత విలువైన 10 సంస్థల్లో ఐదింటి మార్కెట్ విలువ గత వారం రూ.1,85,952.31 కోట్లు పడిపోయింది. ఇందులో బ్యాంకింగ్ రంగ సంస్థలే ఎక్కువగా ఉండటం గమనార్హం. వీటిలో ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌తోపాటు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) కూడా ఉన్నది. గత వారం ట్రేడింగ్ జరిగిన ఐదు రోజుల్లో సెన్సెక్స్ 1,844.2 పాయింట్లు పతనమైన విషయం తెలిసిందే. దీంతో ఆయా సంస్థల మార్కెట్ విలువ కూడా బాగానే క్షీణించింది. ఫలితంగా మదుపరులు లక్షల కోట్ల రూపాయల్లో నష్టపోయారు. ఒక్క హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువే ఈ 5 రోజుల్లో రూ.70వేల కోట్లకుపైగా పడిపోయింది. ఇదిలావుంటే మార్కెట్ విలువపరంగా సెన్సెక్స్‌లో అగ్రస్థానంలో ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.16.81 లక్షల కోట్లతో కొనసాగుతున్నది.

| సంస్థ | నష్టం (రూ.కోట్లలో) |
|---|---|
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 70,479.23 |
| ఐటీసీ | 46,481.00 |
| ఎస్బీఐ | 44,935.46 |
| రిలయన్స్ ఇండస్ట్రీస్ | 12,179.13 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 11,877.49 |

# నేటి నుంచే ఇండియా ఓపెన్

ఢిల్లీ: ఈ ఏడాది రెండో బీడబ్ల్యూఎఫ్ ఈవెంట్ అయిన ఇండియా ఓపెన్ సూపర్ 750 టోర్నమెంట్‌కు మంగళవారం తెరలేవనుంది. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా నేటి నుంచి ప్రారంభం కాబోయే ఈ ఈవెంట్‌లో భారత్ భారీ బృందాన్ని బరిలోకి దింపింది. ఏకంగా 21 మంది షట్లర్లు ఇండియా ఓపెన్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, పురుషుల డబుల్స్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం భారత బృందాన్ని నడిపించనున్నారు. ఇటీవలే వివాహం చేసుకున్న స్టార్ షట్లర్ సింధు.. పెండ్లి తర్వాత ఆడనున్న తొలి టోర్నీ ఇదే. సింగిల్స్ విభాగాల్లో హెచ్‌ఎస్ ప్రణయ్, రజావత్, మాళవిక, ఆకర్షి, అనుపమ బరిలో ఉన్నారు. మహిళల డబుల్స్‌లో త్రిసా–గాయత్రి ద్వయానికి తోడుగా మరో ఏడు జంటలు, మిక్స్‌డ్ డబుల్స్‌లో నాలుగు జోడీలు ఈ టోర్నీ బరిలో నిలిచాయి.

# ఆ ఇద్దరి ఫిట్‌నెస్‌పై ఆందోళన

ముంబై: వచ్చే నెల మొదలుకానున్న ప్రతిష్ఠాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కోసం ఇప్పటికే అన్ని దేశాలూ తమ ప్రాథమిక జట్లను ప్రకటించాయి. కానీ బీసీసీఐ మాత్రం గడువు తేదీ (జనవరి 12) ముగిసినా జట్టును ప్రకటించకపోగా తమకు మరికొంత సమయం కావాలని ఐసీసీని కోరింది. ఈనెల 18 లేదా 19న భారత జట్టును ప్రకటించే అవకాశముంది. అయితే ప్రధానంగా భారత ఏస్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఫిట్‌నెస్ గురించి స్పష్టమైన అవగాహన లేకపోవడంతోనే జట్టు ప్రకటన ఆలస్యమవుతోందని తెలుస్తోంది. ఆస్ట్రేలియాతో చివరి టెస్టులో వెన్ను నొప్పితో గాయపడ్డ బుమ్రా.. చాంపియన్స్ ట్రోఫీ నాటికి పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధిస్తాడా ? లేదా ? అన్నది స్పష్టత లేదు. ఇక గతేడాది స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో గాయపడి శస్త్రచికిత్స చేయించుకున్న కుల్‌దీప్ ప్రస్తుతం ఎన్‌సీఏలో పునరావాసం పొందుతున్నాడు. త్వరలోనే వీళ్ల ఫిట్‌నెస్ రిపోర్ట్ రానుందని, అది వచ్చిన వెంటనే జట్టును ప్రకటిస్తారని జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

# భారత్ బోణీ

**ఖోఖో ప్రపంచకప్ ప్రారంభం | అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు | నేపాల్‌ను ఓడించిన టీమ్‌ఇండియా**





ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ ఆతిథ్యమిస్తున్న మొదటి ఖోఖో ప్రపంచకప్ పోటీలు సోమవారం అట్టహాసంగా మొదలయ్యాయి. ఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియం వేదికగా ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్ కాగడాను వెలిగించి ఈ పోటీలను అధికారికంగా ప్రారంభించారు. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య భారత్.. ఉత్కంఠభరితంగా జరిగిన పోరులో ఐదు పాయింట్ల తేడాతో నేపాల్‌ను ఓడించి బోణీ కొట్టింది. మ్యాచ్‌లో భారత్ 42 పాయింట్లు సాధించగా నేపాల్ 37 పాయింట్లకే పరిమితమైంది. ఆసాంతం ప్రేక్షకులను మునివేళ్లపై కూర్చోబెట్టిన పోరులో భారత్ మధ్యలో తడబడ్డా తర్వాత పుంజుకుని తొలి విజయాన్ని నమోదుచేసింది. నాలుగు టర్న్‌లు (ఒక్కో టర్న్ ఏడు నిమిషాలు) గా జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట అటాకింగ్‌ను ఎంచుకున్న భారత్.. మొదటి టర్న్‌లో నేపాల్ నాలుగు బ్యాచ్(ఒక్కో బ్యాచ్‌లో ముగ్గురు)లను ఆలౌట్ చేసి 24 పాయింట్లు రాబట్టింది. అనంతరం నేపాల్.. అటాకింగ్‌లో 18 పాయింట్లే సాధించింది. రెండో టర్న్‌లో నేపాల్ కాస్త పుంజుకుని తమను తాము అద్భుతంగా డిఫెండ్ చేసుకుంది. దీంతో భారత్ 18 పాయింట్లు మాత్రమే సాధించగలిగింది. కీలకమైన నాలుగో టర్న్‌లో నేపాల్.. 21 పాయింట్లు సాధించాల్సి ఉండగా నేపాలీలు 17 పాయింట్లే దక్కించుకోవడంతో భారత్ విజయఢంకా మోగించింది.

ఈ పోటీల ఆరంభానికి ముందు సాంస్కృతిక కార్యక్రమాలు అభిమానులను అలరించాయి. సుమారు గంటన్నర పాటు సాగిన ఈ వేడుకలలో భారతీయత ఉట్టిపడేలా కళాకారులు ప్రదర్శనలిచ్చారు. కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయ, ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా.. అంతర్జాతీయ, భారత ఖోఖో సమాఖ్య అధ్యక్షుడు సుదాన్షు మిట్టల్‌తో పాటు పలువురు రాజకీయ, క్రీడా ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు.


మంత్రి పొన్నంకు స్వామి ప్రసాదం అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

## నిత్యాన్నదాన సత్రానికి పొన్నం 45 లక్షల విరాళం

వేములవాడటౌన్, జనవరి 13 : వేములవాడ రాజన్న నిత్యాన్నదాన సత్రానికి రోడ్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.45 లక్షల విరాళాన్ని ఈవో వినోద్‌రెడ్డికి అందజేశారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం వేములవాడ రాజన్నను దర్శించుకుని పూజలు చేసి, కోడె మొక్కు చెల్లించుకున్నారు.


## పసుపుబోర్డు చైర్మన్‌గా గంగారెడ్డి

**నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్రమంత్రి**



ఖలీల్‌వాడి జనవరి 13: నిజామాబాద్ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయనున్న జాతీయ పసుపుబోర్డును మంగళవారం ప్రారంభించనున్నట్టు కేంద్రం ప్రకటించింది. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. పసుపుబోర్డు చైర్మన్‌గా నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌కు చెందిన పల్లె గంగారెడ్డిని నియమించారు.

## సీడబ్ల్యూసీ చైర్మన్‌గా ఎంకే సిన్హా నియామకం



హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్‌గా ముఖేశ్‌కుమార్ సిన్హా నియమితులయ్యారు. ఎంకే సిన్హా ప్రస్తుతం గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్‌ఎంబీ) చైర్మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

## డైరెక్టర్‌పై కమిషన్ సీరియస్

హైదరాబాద్, జనవరి 14(నమస్తే తెలంగాణ): సినీ నటి అన్షుపై డైరెక్టర్ నక్కిన త్రినాథరావు చేసిన వ్యాఖ్యలను తెలంగాణ మహిళా కమిషన్ సీరియస్‌గా తీసుకున్నది. ఆయన వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించినట్టు చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ప్రకటించారు.

# పండుగపూట అడ్మిషన్ల ప్రచారం !

- **గురుకుల సిబ్బందికి ఆదేశాలు..**
- **ఒక్కో ఉపాధ్యాయుడికి 2 పల్లెలు**
- **సోషల్ వెల్ఫేర్ సొసైటీ అనాలోచిత నిర్ణయం**
- **ఉన్నతాధికారుల తీరుపై ఆగ్రహం**

హైదరాబాద్, జనవరి13 (నమస్తే తెలంగాణ): సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీలోని ఉపాధ్యాయులు, సిబ్బందికి పండుగ మురిపెం లేకుండా పోయింది. పిల్లాపాపలతో గడిపే అవకాశాన్ని కూడా ఇవ్వకుండా సొసైటీ ఉన్నతాధికారులు సెలవుల్లో గ్రామాల్లోకి వెళ్లి అడ్మిషన్లపై అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కొత్త విధానంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఇంటర్‌బోర్డు ఆదేశాలను పట్టించుకోకుండా సీఈవోల్లోని సీనియర్ ఇంటర్ విద్యార్థులకు సెలవుల్లో తరగతులు నిర్వహిస్తుండటంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లోలోని 5వ తరగతి, అదేవిధంగా 6 నుంచి 9వ తరగతుల్లో ఖాళీల భర్తీకి, సీఈవో, ఎస్‌వోఈ, సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు సంబంధించి విద్యార్థులకు కామన్ ఎంట్రన్స్ పరీక్షను నిర్వహించనున్నారు. విద్యార్థుల నుంచి ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా, ఫిబ్రవరి 1 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఫిబ్రవరి 23న రాష్ట్రవ్యాప్తంగా రాతపరీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. అంతవరకు బాగానే ఉన్నా సంక్రాంతి సెలవులు ఇవ్వకుండా కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌పై ప్రచారం చేయాలని ఆదేశించడమే ఇప్పుడు విమర్శలకు దారితీస్తున్నది. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా 2 గ్రామాలను ఎంచుకొని వెళ్లాలని, అక్కడి పంచాయతీ సెక్రటరీని కలిసి టెస్ట్‌పై అవగాహన కల్పించాలని, 10కి తక్కువగాకుండా అడ్మిషన్లను చేయించాలని సిబ్బందికి ఎస్సీ గురుకుల సొసైటీ ఉన్నతాధికారులు హుకూం జారీ చేశారు. గ్రామపెద్దను, ప్రజలను కలిసి ప్రచారం చేస్తున్న సమయంలో ఫొటోలను తీసి సొసైటీ గ్రూప్‌లో అప్‌లోడ్ చేయాలని సిబ్బందిని ఆదేశించడం గమనార్హం. కరపత్రాలను ముద్రించి సిబ్బందికి అందజేయాలని, క్షేత్రస్థాయిలో పకడ్బందీగా ప్రచారం చేసేలా చూడాలని గురుకుల ప్రిన్సిపాల్స్‌కు సైతం హుకూం జారీ చేశారు.

**సీనియర్ ఇంటర్ విద్యార్థులకు నో హాలిడేస్**

సంక్రాంతి సందర్భంగా ప్రభుత్వం జనవరి 11 నుంచి 17 వరకు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ఏడు రోజుల పాటు సెలవులు ప్రకటించింది. గురుకుల సొసైటీ పరిధిలోని 38 సీవోఈల్లో సీనియర్ ఇంటర్ విద్యార్థులకు మాత్రం తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదేశాలను ప్రభుత్వ అధికారులే ఉల్లంఘిస్తే పరిస్థితి ఏంటని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. మరోవైపు సెలవుల్లో తమకు కొంత ఊరట లేకుండా ఉన్నతాధికారులు మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఎస్సీ గురుకుల సొసైటీ ఉపాధ్యాయులు వాపోతున్నారు. కామన్ టెస్ట్‌పై ప్రచారం చేయాలని ఏ సొసైటీలో లేనివిధంగా ఎస్సీ సొసైటీనే ఆదేశించడంపై సిబ్బంది నిప్పులు చెరుగుతున్నారు.

## నోటీసులకు వివరణ వచ్చే వరకూ ఆగాలి

**కూల్చివేతలపై హైడ్రాకు హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): అక్రమ నిర్మాణాలంటూ నోటీసులిచ్చి, వాటిపై వివరణ ఇచ్చే అవకాశం కూడా ఇవ్వకుండా చర్యలు చేపట్టేందుకు ప్రయత్నించిన హైడ్రా తీరును హైకోర్టు తప్పు పట్టింది. బాధితుల నుంచి వివరణ తీసుకొని, దాన్ని నాలుగు వారాల్లో పరిష్కరించి, ఆ తరువాత చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయంటూ.. రంగారెడ్డి జిల్లా అల్మాస్‌గూడలోని నిర్మాణాలను తొలగించాలంటూ ఈ నెల 10న ఇచ్చిన నోటీసులను సవాలు చేస్తూ జక్కిడి అంజిరెడ్డి సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ లక్ష్మణ్ విచారణ చేపట్టారు. హైడ్రా ఇచ్చిన నోటీసులపై వినతిపత్రం సమర్పించడానికి వెళ్తే కార్యాలయంలో ఎవరూ అందుబాటులో లేరని పిటిషనర తరఫు న్యాయవాది తెలిపారు. వాదనలను విన్న న్యాయమూర్తి హైడ్రా నోటీసుకు వివరణ ఇవ్వడానికి ఈనెల 17వ తేదీ వరకు పిటిషనర్‌కు గడువు ఇవ్వాలని, దానిపై 4 వారాల్లో పరిష్కరించి నిర్ణయం వెలువరించాక చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని హైడ్రాను ఆదేశించారు.

# దావోస్ పెట్టుబడులపై సీఎం సమీక్ష

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): నిరుడు దావోస్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో 18 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరాయని, వీటిలో 17 ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయని అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిపారు. పది ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉండగా, ఏడు ప్రాజెక్టులు ప్రారంభ దశలో ఉన్నాయని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 16 నుంచి 22 వరకు విదేశీ పర్యటనలు నిర్వహించనున్న నేపథ్యంలో నిరుటి పెట్టుబడులపై సోమవారం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సానుకూలతలను ప్రపంచ వేదికపై పరిచయం చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు.నిరుడు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ఏయే కంపెనీలు రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభించాయో అడిగి తెలుసుకున్నారు. దావోస్‌లో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 14 కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు వచ్చాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు నరేందర్ రెడ్డి, ప్రత్యేక కార్యదర్శిఅజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం భూమిపై ప్రభుత్వానికి నోటీసు

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయ్‌పోల్ గ్రామంలోని సర్వే నం.221లోని 3.20 ఎకరాల ప్రభుత్వ భూమి రక్షణలో అధికారులు విఫలమవుతున్నారంటూ బహుజన సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు దాఖలు చేసిన పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. హైకోర్టులో పిటిషన్ వేశారు.. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ప్రభుత్వానికి చెందిన 3.2 ఎకరాల భూమి ఆక్రమణలకు గురవుతున్నదని, శ్రీ ఇందూ ఇంజినీరింగ్ కాలేజీ ఆక్రమించుకున్నదని 2023 సెప్టెంబర్‌లో, 2024 మార్చిలోను వినతిపత్రాలు సమర్పించినా కలెక్టర్, ఆర్డీవో, తాసీల్దార్ చర్యలు తీసుకోవడంలేదని తెలిపారు. రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ విధుల నిర్వహణలో అనైతికంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వాదనలను విన్న న్యాయమూర్తి ప్రభుత్వానికి, అధికారులకు, ఇందూ కాలేజీకి నోటీసులు జారీచేస్తూ కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. సర్వే నం.221లోని 3.2 ఎకరాలకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు నిర్వహించరాదంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. నవీన్ మిట్టల్‌పై వ్యక్తిగతంగా తీవ్రమైన ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన వ్యక్తిగత హోదాలో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తూ విచారణను ఫిబ్రవరి 4కు వాయిదా వేశారు.

## దవాఖానలో బర్త్‌డే వేడుకలపై సర్కార్ సీరియస్

**నిజామాబాద్ సూపరింటెండెంట్ సస్పెన్షన్**




హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): రోగులను పట్టించుకోకుండా దవాఖానలో పుట్టిన రోజు వేడుకలు చేసుకున్న నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ ప్రతిమరాజ్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆమెపై విచారణకు ఆదేశించింది. వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 10 రాత్రి సూపరింటెండెంట్ చాంబర్‌ను ఫంక్షన్ హాల్ స్థాయిలో అలంకరించడం, కేకు, బొకేలు, బహుమతులతో అట్టహాసంగా వేడుకలు నిర్వహించారు. ఫిట్స్‌తో బాధపడుతూ వచ్చిన రోగిని సిబ్బంది పట్టించుకోలేదు. బాధిత మహిళను ఆమె భర్త భుజాన వేసుకొని ఏడు అంతస్తులు కలియదిరిగినా ఫలితం లేకపోయింది. చివరికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ఫోన్ చేస్తే అర్ధరాత్రి దాటిన తర్వాత చికిత్స అందించినట్టు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై నమస్తే తెలంగాణలో 'దవాఖాననా? ఫంక్షన్ హాలా?' శీర్షికన కథనం ప్రచురించగా, సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

# జైన శిల్పాలను పరిరక్షించాలి

- **కంకల్‌ను వారసత్వ గ్రామంగా ప్రకటించాలి :ఈమని శివనాగిరెడ్డి**


కంకల్ గ్రామంలోని జైన శిల్పాలను పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

హైదరాబాద్, జనవరి 13(నమస్తే తెలంగాణ) : వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కంకల్ గ్రామంలో నిర్లక్ష్యానికి గురవుతున్న వెయ్యేళ్ల నాటి జైన శిల్పాలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని, కంకల్‌ను వారసత్వ గ్రామంగా ప్రకటించాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి సోమవారం ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశా రు. 50కిపైగా శిల్పాలు పట్టించుకునే నాథుడు లేక చెల్లాచెదురుగా పడిఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాదామీ చాళుక్య కాలపు (క్రీ.శ 8వ శతాబ్ది) నిలువెత్తు గణేశుడి విగ్రహం, నంది శిల్పాలు, రాష్ట్రకూటుల కాలపు (క్రీ.శ 9వ శతాబ్ది) జైన పార్శ్వనాథ, మహావీర, యక్ష, యక్షిణీ శిల్పాలు, కళ్యాణీ చాళుక్యుల కాలపు (క్రీ.శ. 11వ శతాబ్ది) నాగదేవతలు, కాకతీయుల కాలపు సప్తమాతృక, శత్రు సంహారంలో ప్రాణాలొదిన వీరుల శిల్పాలు, రెండు శాసనాలు, ఎండకు ఎండు తూ, వానకు తడుస్తూ పాడైపోతున్నాయని తెలిపారు. ముఖ్యంగా పార్శ్వనాథుడు, యక్ష, యక్షిణీ శిల్పాలు, వర్ధమానమహావీరుని తల, మొండెం భిన్నమైన శిల్పాలు, సింహం బొమ్మలతో చెక్కిన శిల్పం, అతి పెద్ద వర్ధమాన మహావీరుని శిల్పం పీఠం తదితర శిల్పాలు రాష్ట్రకూటుల శిల్పశైలికి అద్దం పడుతున్నాయని చెప్పారు.

# 'చదువుల అమ్మలు'

- **మొత్తం టీచర్లల్లో 63% మహిళలే**
- **ప్రైవేట్ బడుల్లో 74% ఉమెన్ టీచర్లు**
- **వెల్లడించిన యూడైస్ ప్లస్ నివేదిక**

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : అమ్మలే చదువులమ్మలుగా స్థానం సంపాదించారు. రాష్ట్రంలోని పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించేవారిలో అత్యధికంగా మహిళలే ఉన్నారు. మొత్తం టీచర్లలో 63శాతం మహిళలే ఉండటం విశేషం. ప్రైవేట్ పాఠశాలల్లో కూడా 74శాతం మంది మహిళా టీచర్లే. ఆసక్తికరమైన ఈ విషయాన్ని యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఆన్ ఎడ్యుకేషన్ (యూ డైస్) ప్లస్ నివేదిక ఇటీవలే వెల్లడించింది. రాష్ట్రంలోని అన్ని రకాల బడుల్లో 3,41,460 టీచర్లు పనిచేస్తున్నారు. వీరిలో 2,15,325 టీచర్లు(63శాతం) మహిళలే. మరో 1,26,135 (34శాతం) పురుష టీచర్లు పనిచేస్తున్నారు. ఇక ప్రైవేట్‌లో 74.81శాతం మహిళా టీచర్లుండగా, కేవలం 26శాతం మాత్రమే పురుషులు పనిచేస్తున్నారు. ఎయిడెడ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. అయితే సర్కారు బడుల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అత్యధికంగా పురుష టీచర్లు పనిచేస్తుండగా, మహిళా టీచర్లు పురుషుల కంటే తక్కువగా ఉన్నారు. మొత్తంగా ఎల్‌కేజీ, యూకేజీ వంటి ప్రీ ప్రైమరీలో 6,038 టీచర్లుంటే 5,934 మంది మహిళలు కాగా, కేవలం 104 మంది పురుషులున్నారు. ప్రాథమిక తరగతుల్లో మొత్తం 1,03,074 టీచర్లకు 72,499 మహిళలు కాగా, 30,575 పురుషులు పనిచేస్తున్నారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.